సాక్షి చిత్తూరు

శనివారం। 27। ఏప్రిల్। 2024



పకడ్బందీగా నామినేషన్ల పరిశీలన

జిల్లాలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ఆయా నియోజకవర్గాల ఆర్‌వోలు పకడ్బందీగా నిర్వహించారు. - 8లో



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో శుక్రవారం పెద్దసంఖ్యలో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో



నేడు జిల్లా కోర్టు కాంప్లెక్స్ ప్రారంభం

చిత్తూరులో అధునాతనంగా నిర్మించిన జిల్లా కోర్టు కాంప్లెక్స్‌ను శనివారం ప్రారంభించనున్నారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటాం



ఎమ్మెల్యే వెంకటేగౌడతో ముస్లిం నేతలు

పలమనేరు : వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటామని, పరామర్శ పేరిట రాజకీయాలు చేస్తున్న టీడీపీకి మద్దతు పలికేది లేదని ముస్లిం నేతలు స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం మసీదువీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కమాల్‌కు ఆపరేషన్ జరిగి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా మాజీమంత్రి అమరనాథ్‌రెడ్డి వెళ్లి పరామర్శించారు. దాన్ని ఫొటోలు తీసి టీడీపీ సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. దీనిపై మైనారిటీ నాయకులు మండిపడ్డారు. ఎన్నికల ప్రచారానికి మసీదు వీధికొచ్చిన ఎమ్మెల్యే వెంకటేగౌడకు విషయాన్ని తెలిపి ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలను వేసుకున్నారు. తామెన్నటికీ వైఎస్సార్‌సీపీనేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు జాఫర్, కమాల్, ఇస్మాయిల్, హైదర్ పాల్గొన్నారు.

అమర్ కంటే వలంటీర్లే మేలు



సుభాష్ చంద్రబోస్, సూపర్‌బజార్ అధ్యక్షుడు

పలమనేరు : తోడబుట్టిన సొంత తమ్ముడికే ఏం చేయని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ఇక జనానికి ఏం చేస్తారని పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోష్ విమర్శించారు. శుక్రవారం పలమనేరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. అమర్ కంటే ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్లు ఎన్నోరెట్లు మేలని స్పష్టం చేశారు. మాజీ మంత్రి తన హయాంలో ఏదైనా అభివృద్ధి చేసుంటే జనం ఎందుకు ఓడించారని ప్రశ్నించారు. ఏ పార్టీలో గెలిచామని పట్టించుకోకుండా పదవులకోసం దేనికైనా సిద్ధపడినందుకే జనం చీదరించుకుంటున్నారన్నారు. ఏఎండకు ఆ గొడుగుపట్టే ఇలాంటి నాయకులకు ప్రజల్లో విలువ ఉండదని తెలిపారు. వలంటీర్లు సైతం తమ పదవులకు రాజీనామా చేసి ఆపై వైఎస్సార్‌సీపీ పార్టీలోకి చేరారని కానీ వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యేగా గెలిచిన అమరనాథ్‌రెడ్డి మాత్రం పదవికి రాజీనామా చేయకుండానే టీడీపీలో చేరారని మండిపడ్డారు. రాజకీయాల్లో పదవులు, వారి సంపాదనల కోసం రంగులు మార్చేవారికి జనం తగిన బుద్ధి చెబుతారని వివరించారు. ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు.

ఆసక్తి ఉంటే ఎన్నికల విధులు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ఆసక్తి ఉంటే మాజీ సైనికులు పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 60 ఏళ్ల లోపు మాజీ సైనికులు ఆర్మీ నంబర్, ర్యాంక్, అడ్రెస్, ఆధార్ వివరాలతో ఈ నెల 29వ తేదీలోపు కార్యాలయంలో పేర్లు ఇవ్వాలన్నారు. గతంలో పేర్లు నమోదు చేసుకున్న వారు ప్రస్తుతం నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఆయా పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వేసవి సెలవులను కచ్చితంగా అమలు చేయాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెడితే అనుమతులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

షోకాజ్ నోటీసుల ఉపసంహరణకు వినతి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో యూడైస్ వివరాల సమర్పణలో సాంకేతిక లోపం కారణంగా వందలాది మంది టీచర్లకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ నేత గంటామోహన్ కోరారు. శుక్రవారం ఈ మేరకు డీఈఓ దేవరాజుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాలకు టీచర్లను బాధ్యులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. అనంతరం పలు అంశాలపై డీఈఓ తో చర్చించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, ఎంఈఓ–2 త్యాగరాజరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పాలారుకు చంద్రగ్రహణం!

ప్రాజెక్టు నిర్మాణానికి ఎంపిక చేసిన ప్రాంతం



టీడీపీ అధినేత చంద్రబాబులో పెరిగిన కీర్తి కండూతికి కుప్పం వాసులు బలయ్యారు. దశాబ్దాలుగా మోసిన ప్రజల తాగు.. సాగునీటి కష్టాలను తీర్చే పాలారు ప్రాజెక్టుకు ఘనత వహించిన బాబుగారు గ్రహణం పట్టించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారనే కారణంతో పనులకు మోకాలడ్డారు. ఇది పూర్తయితే తన అడ్డాలో వైఎస్సార్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందనే అక్కసుతో కుతంత్రాలకు తెరతీశారు. తమిళనాడులోని రాజకీయ పార్టీలతో కుమ్మక్కై సొంత నియోజకవర్గం గొంతు కోశారు. 35 ఏళ్లపాటు గెలిపించిన జనాలకు ద్రోహం చేస్తూ పాలారు ప్రాజెక్టు ఊసే లేకుండా చేశారు. సస్యశ్యామలమై సిరులు కురిపించాల్సిన నేలను బీడు భూమిగా తయారు చేశారు.

- కుప్పం ప్రజల ఆశలపై నీళ్లు చల్లిన చంద్రబాబు
- సాగు..తాగునీటి కష్టాలకు ఆయనే కారణం
- తమిళ పార్టీలతో కుమ్మక్కై సొంత నియోజకవర్గంపైనే విషం
- ఇప్పటికీ ప్రాజెక్టు పనులను పట్టించుకోని వైనం

కుప్పం : నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవమంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పానికి చేసింది శూన్యం. 35 ఏళ్లుగా ప్రాతినిథ్యం వహించినా ఇక్కడి నీటి సమస్యను తీర్చలేకపోయారు. బూటకపు మాటలు, హామీలతో కుప్పంవాసులను బురిడీ కొట్టించడమే తప్ప చేసిందేమీ లేదు.

ప్రాజెక్టుకు జీవం పోసిన వైఎస్సార్

కర్ణాటకలోని బేతమంగళం నుంచి కుప్పం మీదుగా తమిళనాడుకు ప్రవహించే పాలారు నదిపై ప్రాజెక్టు నిర్మించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పించారు. కరువు ప్రాంతమైన కుప్పం నియోజకవర్గం తాగు, సాగునీటి అవసరాలను తీర్చాలని నిర్ణయించారు. ఈ మేరకు 2007లో ప్రాజెక్టు నిర్మాణానికి గణేష్‌పురం వద్ద స్థలం ఎంపిక చేశారు. రూ.52 కోట్లు మంజూరు చేశారు. 0.60 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా డీపీఆర్ రూపొందించారు. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. దీంతో కాంట్రాక్టర్లు మిషనరీ, ఇతరత్రా సామాగ్రిని సైతం ప్రాజెక్టు నిర్మాణ స్థలం వద్దకు చేర్చారు. ఇక శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తారనగా సన్నివేశంలోకి స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు ప్రవేశించారు. తన సొంత నియోజకవర్గంలో వైఎస్సార్‌కు పేరు వస్తుందని కుట్ర చేసి మరీ ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 40వేల ఎకరాలకు సాగునీరు అందేది. కుప్పం, గుడుపల్లె, శాంతిపురం మండలాల దాహార్తి తీరేది. అయితే కేవలం స్వార్థ రాజకీయాలే తప్ప ప్రజా ప్రయోజనాలు పట్టని చంద్రబాబు పన్నాగాలకు కుప్పం నియోజకవర్గం ఇక్కట్ల పాలైంది.

మళ్లీ ఊపిరి పోసిన సీఎం వైఎస్ జగన్

ఇటీవల కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ పాలారుకు ఊపిరి పోశారు. ప్రాజెక్టు నిర్మాణానికి పాలనపరమైన అనుమతులతోపాటు రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. వైఎస్సార్ శ్రీకారం చుట్టిన ప్రాజెక్టును తప్పకుండా పూర్తిచేస్తామని కుప్పం నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు.

అపోహలు సృష్టించి..!

పాలారు ప్రాజెక్టును వైఎస్సార్ నిర్మిస్తే కుప్పంలో తన పరపతి తగ్గిపోతుందని, రాజకీయంగా బలహీన పడతామనే ఈర్ష్యతో చంద్రబాబు తమిళనాడులోని కొన్ని రాజకీయ పార్టీలతో కుమ్మక్కయ్యారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమిళనాడులో నీటి సమస్యలు తలెత్తుతాయని అపోహలు సృష్టించారు. తమిళులు ఆందోళనలు చేపట్టేలా రెచ్చగొట్టారు. ప్రోత్సహించారు. తమిళనాడులోని పాటాలి మక్కల్ కచ్చి అధ్యక్షుడు రాందాస్‌తో చంద్రబాబు చేతులు కలిపి భారీగా నిరసనలు, ఆందోళనలకు పథకం వేసి అమలు చేశారు. అలాగే అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితకు సైతం చంద్రబాబు లేఖ రాసినట్లు ప్రచారం జరిగింది. అయినప్పటికీ ప్రాజెక్టు నిర్మించి తీరాల్సిందే అని వైఎస్సార్ పట్టుబట్టారు. అధికారులతో ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే చంద్రబాబు, రాందాస్ సంయుక్తంగా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అటవీశాఖ అనుమతులు లేవని పిటిషన్ వేసి పాలారుకు గ్రహణం పట్టించారు.

బాబు పట్టించుకోలేదు



పాలారు ప్రాజెక్టును చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రాజెక్టు కార్యరూపం దాల్చగానే ఆయన తట్టుకోలేకపోయారు. ఇక్కడ వైఎస్సార్‌కు పేరు వస్తుందో అని కక్షగట్టి తమిళనాడు వాళ్లతో కలిసి పనులు ఆపివేయించారు. ఇప్పుడు కూడా ఆయనకు పాలారు ప్రాజెక్టు నిర్మాణం ఇష్టం లేదు. ఇది కట్టినా వైఎస్సార్‌కే పేరు వస్తుందనే భావిస్తున్నారు. కుప్పం ప్రజలకు నిజంగా అన్యాయం చేస్తున్నారు.

– వెంకటేష్, చింతాయప్పకొటాలు

బాబు వల్లే ప్రాజెక్టు ఆగింది



పాలారు నదిపై ప్రాజెక్టు నిర్మాణానికి 20 ఏళ్ల క్రితం అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కేవలం చంద్రబాబు కారణంగా ఆ పనులు ఆగిపోయాయి. ఆ ప్రాజెక్టు కట్టి ఉంటే మాకు ఇప్పుడు నీటి సమస్యలే ఉండేవి కావు. వైఎస్ రాజశేఖరరెడ్డిపై ఈర్ష్యతోనే చంద్రబాబు ఇలాంటి పనులకు తెగబడ్డారు. కుప్పం ప్రజలపై ఆయన చూపించేది కపట ప్రేమే. ఇక చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదు. – వెంకటేష్, గిడ్డేగానిపెంట, కుప్పం మండలం

పిల్లల భవిష్యత్ బావుండేది



సుమారు 35 ఏళ్లుగా చంద్రబాబును చూస్తున్నాం. ఏవేవో మాయమాటలు చెప్పి మమ్మల్ని మోసం చేస్తూనే ఉన్నారు. ఇన్నేళ్లలో కనీసం ప్రజలకు తాగడానికి నీరు కూడా ఇవ్వలేదు. ఆయన ఇవ్వరు.. వేరే ఎవరైనా ఇస్తామంటే అడ్డుపడతారు. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పాలారు ప్రాజెక్టు కడతారని ఎంతో ఆశించాం. పక్కనే మా గ్రామం ఉండడంతో ఇక నీటి ఇక్కట్లు పోయినట్టే అని సంతోషించాం. అయితే ఆ పనులను కూడా చంద్రబాబే అడ్డుకున్నారు. ఈ ప్రాజెక్టు వచ్చి ఉంటే మా పిల్లల భవిష్యత్ ఎంతో బావుండేది.

– రామకృష్ణప్ప, ఓటికుంట, కుప్పం మండలం

నీటికి అడ్డుపడడం సరికాదు



ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుపడిన చంద్రబాబు, ఇక కుప్పం నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేస్తారు. ఇక్కడి వాళ్లకి మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవడానికి ఆయన బాగా అలవాటు పడ్డారు. అప్పట్లో ఈ ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఈ 20 ఏళ్లలో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోయేవి. చంద్రబాబు తన స్వార్థం కోసం కుప్పం ప్రజలు, రైతులను సర్వనాశనం చేశారు.

– గణేష్, కౌసిగానిపల్లె, కుప్పం మండలం

'కూటమి'కి తప్పదు ఓటమి

- బాబు..కిరణ్..పవన్‌కు ప్రజా తిరస్కారం తథ్యం
- ముఖ్యమంత్రులుగా వారు చేసింది శూన్యం
- నిరాశతోనే సీఎం వైఎస్ జగన్‌పై విమర్శలు
- వైఎస్సార్‌సీపీ పాలనలోనే కుప్పం అభివృద్ధి
- మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరులో ప్రజలకు అభివాదం చేస్తూ పర్యటిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఓటమి తప్పదని మంత్రి, వైఎస్సార్‌సీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీనాథరెడ్డి, అనీషారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డికి రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ కుప్పంలో చంద్రబాబు, రాజంపేటలో కిరణ్‌కుమార్‌రెడ్డి, పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌కు ప్రజా తిరస్కారం తథ్యమన్నారు. ఎన్నికల్లో గెలవలేమనే నిరాశతోనే సీఎం జగన్, తన కుటుంబంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పినట్లు కిరణ్ తేడా వ్యక్తని వెల్లడించారు. రైల్వేకోడూరు సభలో కూటమి అభ్యర్థులు బాబు, కిరణ్, పవన్ కలిసి ముఖ్యమంత్రి జగన్‌పై, తన కుటుంబంపై విమర్శలు చేయడంపై మండిపడ్డారు. అభివృద్ధి చేస్తామని ప్రజల్లోకి వెళ్లకుండా తమను దూషించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడుసార్లు కుప్పం ఎమ్మెల్యేగా గెలిచి, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు కుప్పానికి హంద్రీ-నీవా నీటిని కూడా ఇవ్వలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో నీటిని విడుదల చేశారని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో టీడీపీని కుప్పం ప్రజలు భూస్థాపితం చేశారని, ప్రస్తుతం చంద్రబాబును కూడా ఓడిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అలాగే రాజంపేటలో సూట్‌కేస్‌తో వచ్చిన కిరణ్‌కు డిపాజిట్లు కూడ రావని స్పష్టం చేశారు. పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌కు ఓటమి తప్పదని స్పష్టం చేశారు. రాయలసీమలో 52 స్థానాలు గెలుస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జూన్‌లో మళ్లీ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జి ఫకృద్దీన్‌షరీఫ్ పాల్గొన్నారు.

సిద్ధం.. బాబుకు గుణపాఠం



నాసంపల్లె చర్చిలో ప్రార్థన చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధర నెల్లూరు : సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుకు మరోసారి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. శుక్రవారం గంగాధర నెల్లూరు మండలం ముక్కలతూరు, ఆత్మకూరు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాసంపల్లె చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వెన్నుపోటుదారుడైన చంద్రబాబుకు మరోసారి ఓటమి తప్పదని స్పష్టం చేశారు. 14 ఏళ్ల రాక్షస పాలన చూసిన జనం తెలుగుదేశం పార్టీని నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. 175 నియోజకవర్గాలలో సీఎం జగనే అభ్యర్థి అని, ఎక్కడికి వెళ్లినా ప్రజలంతా జగన్ వైపే ఉన్నారని వెల్లడించారు. ఫ్యాను గుర్తుకే ఓటు వేస్తామని, తామంతా జగనన్న పరిపాలనలో సంతోషంగా ఉన్నామని మరో 30 ఏళ్లు సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగిస్తామని ప్రజలు చెబుతున్నారని వివరించారు. చంద్రబాబు అధికారంలో ఎంతమందినైనా మోసం చేస్తారని విమర్శించారు. కుట్రలతో కూటమి కట్టిన పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతల డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, కూటమికి షాక్ ఇస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమార్తె కృపాలక్ష్మిని ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, జిల్లా రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు వేల్కూరు బాబు రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి, మండల రైతు భరోసా అధ్యక్షుడు బాబు రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరక నెల్లూరు కోదండన్, ముక్కలతూరు సర్పంచ్ అనిలా అబు, ఎంపీటీసీ సభ్యులు సుశీలమ్మ, ఆత్మకూరు సర్పంచ్ జయచంద్రారెడ్డి, ఆత్మకూరు ఎంపీటీసీ సభ్యులు మగిమై దాస్, ఎంపీటీసీ మాజీ సభ్యులు అబు, నాయకులు సుబ్బారెడ్డి, చిన్నబ్బ, ధనరాజ్, మణివాసన్, మహిమా దాస్, వెంకటేష్, కృష్ణ బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం.. అభివృద్ధి



నింద్ర మండలం ఇరుగువాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి రోజా

నింద్ర : సంక్షేమం, అభివృద్ధి పథకాలు వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి రోజా తెలిపారు. శుక్రవారం మండలంలోని గురువాయి పంచాయతీ ఇరుగువాయి, ఇరుగువాయి హరిజనవాడ, ఇరుగువాయి ఎస్టీ కాలనీ, పర్వతరాజపురం, పర్వతరాజపురం ఎస్టీ కాలనీలలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ నిజాయితీకి నిలువుటద్దం జగనన్న అని, ఏమార్చడంలో ఎవర్‌గ్రీన్ చంద్రబాబు అని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరిస్తూ ఇవన్నీ కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చే ఏకైక నాయకుడు జగనన్న మాత్రమే అన్నారు. ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కేది చంద్రబాబు అని విమర్శించారు. సంక్షేమ లబ్ధి క్రమం తప్పకుండా మహిళల ఖాతాలకు పడుతోందని, పాలన చేరువగానే జరుగుతోందని, వైద్యం అందుబాటులో ఉందని, విద్య మెరుగుపడిందని ఇది కాదా ప్రజా సంక్షేమమని వివరించారు. . నగరి నియోజకవర్గంలో గతంలో ఎవరూ చేయనివిధంగా అభివృద్ధి చేసిన తనను ఓటుతో ఆశీర్వదించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై బటన్‌ను రెండు సార్లు నొక్కాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుబా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, సర్పంచ్ రాజేష్, జెడ్పీటీసీ సభ్యులు మల్లీశ్వరి, కో–ఆప్షన్ సభ్యుడు అనిల్, పార్టీ మండల అధ్యక్షుడు వేణురాజు, సచివాలయాల మండల కన్వీనర్ బాబురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు విజేష్, మంజుల, నాయకులు లక్ష్మిపతి, దామోదరం, వీరయ్య, గోవిందమ్మ పాల్గొన్నారు.

పుంగనూరు బరిలో 'రామచంద్రులు'



మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి



బీసీవై అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్

పుంగనూరు: సార్వత్రిక ఎన్నికల్లో పుంగనూరు నుంచి ముగ్గురు రామచంద్రులు బరిలో దిగుతున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీడీపీ నుంచి చల్లా రామచంద్రారెడ్డి, బీసీవై తరఫున బోడే రామచంద్రయాదవ్ పోటీ పడుతుండడం విశేషం.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురు వారం అర్ధరాత్రి వరకు 61,492 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి హుండీలో రూ. 2.72 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పక్కాగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 28వ తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ, ఇతర అధికారులకు పోలింగ్ సామాగ్రి పంపిణీపై సమావేశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అధికారులు పోలింగ్ సామగ్రి, మౌలిక సదుపాయాలపై నివేదికలు తీసుకురావాలని ఆదేశించారు. సంబంధిత నియోజకవర్గాల్లో పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే కేంద్రాల వద్ద దాదాపు 2 వేల మందికి సరిపడే ఏర్పాట్లు చేయాలన్నారు. మే 12వ తేదీ ఉదయం 7 గంటలకల్లా విధులు నిర్వహించే అన్ని కేడర్‌ల ఉద్యోగులు సామగ్రి పంపిణీ కేంద్రాల వద్దకు చేరుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక బస్సులతో బయలుదేరి వెళ్లాల్సి ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో చిత్తూరు ఆర్‌ఓ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ కసరత్తు

పోస్టల్‌బ్యాలెట్ కసరత్తును పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం చిత్తూరులోని డీఈఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న పోస్టల్‌బ్యాలెట్ కసరత్తు ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను సక్రమంగా భద్రపరచాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ, పోస్టల్‌బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన

చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ పరిశీలించారు. పోలీస్ అబ్జర్వర్ అరవింద్‌తో కలిసి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. షణ్మోహన్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అలసత్వం ఉండకూడదని స్పష్టం చేశారు. పటిష్టంగా బందోబస్తు కల్పించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

ఈతకు వెళ్లి బాలుడి మృతి



బాలుడి మృతదేహం వద్ద ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

సదుం: ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన ఘటన సోమల మండలంలో శుక్రవారం జరిగింది. వివరాలు.. కారేవాండ్ల పల్లెకు చెందిన మునివెంకట సిద్దులు కుమారుడు భవిత్‌కుమార్(14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సెలవులు కావడంతో సోమల మండలంలో ఎస్. నడింపల్లెలో అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ గ్రామ సమీపంలోని గుంజు చెరువులో స్నేహితులతో కలసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. బాలుడి మృతదేహాన్ని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సందర్శించి, కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున నాయిని, గురురెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



మోనీష్ (ఫైల్)

పుత్తూరు: పట్టణంలోని ఈశ్వరాలయం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఏఎస్ఐ బాలసుబ్రమణ్యం కథనం మేరకు... నారాయణవనం మండలం సుబ్బానాయుడు కండ్రిగకు చెందిన ఆశా, వెంకటేష్ దంపతుల కుమారుడు ఎస్. మోనీష్ (22) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటూ పుత్తూరులోని దెయ్యాలగుంట వీధిలో అవ్వా తాతల వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మోటర్ సైకిల్‌పై వెళుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంతో మోనీష్ అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్ట్

చౌడేపల్లె : మండలంలోని ఆమినిగుంటలో ఓ దివ్యాంగురాలు (50)పై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు వెంకటరమణ అలియాస్ రామును అరెస్ట్ చేసినట్లు దిశ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చౌడేపల్లె సర్కిల్ కార్యాలయంలో సీఐ కృష్ణారెడ్డి , ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈనెల 22 వ తేదీన దివ్యాంగురాలి ఇంట్లోకి నిందితుడు చొరబడి అఘాయిత్యానికి పాల్పడినట్లు వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

పకడ్బందీగా నామినేషన్ల పరిశీలన



చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

- 67 తిరస్కరణ.. 105 మంది అభ్యర్థులకు ఆమోదం
- 29 వరకు ఉపసంహరణకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల పరిశీలనను ఎన్నికల అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. చిత్తూరు పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 172 మంది నామినేషన్లను దాఖలు చేయగా 67 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 105 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు ఆమోదించారు. నిఘా నీడలో నిబంధనలు మేరకు పరిశీలన ప్రక్రియను చేపట్టారు. కలెక్టరేట్‌లో చిత్తూరు పార్లమెంట్, చిత్తూరు అసెంబ్లీ స్థానాల పరిశీలన, మిగిలిన 6 నియోజకవర్గ కేంద్రాల్లోని ఆయా ఆర్‌ఓ కార్యాలయాల్లో పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. అభ్యర్థుల సమక్షంలో సీసీ కెమెరా, వీడియో కవరేజ్, అబ్జర్వర్ల పర్యవేక్షణలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తి చేశారు. అనంతరం ఆమోదించిన నామినేషన్లు, తిరస్కరించిన నామినేషన్ల వివరాలను ఆయా ఆర్‌ఓలు ప్రకటించారు. ఎన్నికల సంఘం జారీచేసిన షెడ్యూల్ ప్రకారం ఆమోదించిన నామినేషన్లలో ఉప సంహరణకు ఈ నెల 29 వ తేదీ ఆఖరి తేదీగా అధికారులు వెల్లడించారు. 28 ఆదివారం సెలవురోజు కావడంతో నామినేషన్ల ఉపసంహరణకు 27, 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం ఉంటుంది. 29 వ తేదీన బరిలో ఉండే అభ్యర్థుల పేర్లను ఆర్‌ఓలు ప్రకటించనున్నారు.

నామినేషన్ల సమాచారం

నియోజకవర్గం	దాఖలైనవి	తిరస్కరణకు గురైనవి	ఆమోదం పొందినవి
చిత్తూరు (పార్లమెంట్)	35	14	21
పుంగనూరు	15	05	10
నగరి	24	17	07
జీడీ నెల్లూరు	21	09	12
చిత్తూరు	21	07	14
పూతలపట్టు	19	07	12
పలమనేరు	19	05	14
కుప్పం	18	03	15
మొత్తం	172	67	105

మాజీ మంత్రి తాజా 'రాజీ'కీయం!

- కాంగ్రెస్ అభ్యర్థికి రహస్య సాయం
- వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చడమే లక్ష్యం



ఇటీవల తన నివాసానికి వచ్చిన అమరనాథరెడ్డితో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత పార్థసారథిరెడ్డి (ఫైల్)

పలమనేరు : మాజీ మంత్రి, టీడీపీ పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథరెడ్డి తాజాగా 'రాజీ'కీయానికి తెరతీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల కారణంగా ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని పసిగట్టిన అమరన్న ప్రస్తుతం సరికొత్త ఎత్తుగడలు వేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓట్లను చీల్చేందుకు కాంగ్రెస్ అభ్యర్థిని పావుగా వాడుకుంటున్నట్లు తెలిసింది. పలమనేరు నియోజకవర్గంలో టీడీపీకి లోలోప సాయం చేసేలా కాంగ్రెస్ అభ్యర్థితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని ఏఐసీసీ సభ్యుడు, పలమనేరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పార్థసారథిరెడ్డి సైతం ఇటీవల తన నివాసానికి వచ్చిన అమర్‌నాథ్‌రెడ్డిని నేరుగా అడిగిన విషయం పాఠకులకు విదితమే. అయితే టీడీపీ ఆడుతున్న నాటకాన్ని బాగా గమనిస్తున్న సాంప్రదాయ కాంగ్రెస్ ఓటర్లు మాత్రం తమదైన తీర్పునిచ్చేందుకు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. టీడీపీని గెలిపించేందుకి తామెందుకు తాము కాంగ్రెస్‌కు ఓటేయాలనే ఆలోచనలో పడినట్టు క్షేత్రస్థాయిలో పరిస్థితని గమనిస్తే ఇట్టే అర్థమవుతోంది.

అమరన్నకు తప్పని ఇంటి పోరు!

- వైఎస్సార్‌సీపీలోకి శ్రీనాథ్‌రెడ్డి, అనీషారెడ్డి దంపతులు
- బాబు తీరు నచ్చకే టీడీపీకి బైబై



శ్రీనాథ్‌రెడ్డి



అనీషారెడ్డి

పలమనేరు : మాజీ మంత్రి, పలమనేరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథ్‌రెడ్డికి ఇంటి పోరు తప్పలేదు. ఆయన తమ్ముడు శ్రీనాథ్‌రెడ్డి, మరదలు అనీషారెడ్డి దంపతులు వైఎస్సార్‌సీపీలో చేరడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. చంద్రబాబు వైఖరి నచ్చకే వారు టీడీపీతో నలభై ఏళ్ల అనుబంధాన్ని తెంచుకున్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లో ఈ పరిణామంతో టీడీపీకి గట్టి దెబ్బతగిలినట్టే అని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. 2019 ఎన్నికల్లో పుంగనూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా అనీషారెడ్డి పోటీ చేసి ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఆపై టీడీపీ అధినేత ఆమెను పక్కనపెట్టడం, నియోజకవర్గ ఇన్‌చార్జిగా చల్లా బాబును రంగంలోకి దింపడంతో అనీషారెడ్డి దంపతులు జీర్ణించుకోలేకపోయారు. అప్పటి నుంచి ఆమె పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటూ వచ్చారు. ఈ ఎన్నికల్లో చల్లా బాబును టీడీపీ అభ్యర్థిగా ప్రకటించే విషయంలోనూ చంద్రబాబు ఆమెను సంప్రదించలేదు. పైగా చల్లాబాబు సైతం అనీషారెడ్డి, శ్రీనాథరెడ్డి దంపతులు పట్టించుకోలేదు. తన నామినేషన్‌కు సైతం వారిని ఆహ్వానించలేదు. చంద్రబాబు, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి నిర్లక్ష్యంపై అనీషారెడ్డి దంపతులు ఇన్నాళ్లు మధనపడుతూనే ఉన్నారు. ఈ క్రమంలోనే అమర్ నామినేషన్‌కు సైతం తమ్ముడు, మరదలు హాజరు కాలేదు. ఇప్పటి వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన సోదరి షర్మిలమ్మ దూరమైందని మీటింగుల్లో విమర్శించే అమరనాథ్‌రెడ్డి ఇకపై ఆ ఊసెత్తే పరిస్థితి ఉండదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక



పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన రహమత్‌బాషా, ఖలీల్ అహమ్మద్, ఇమ్రాన్



మైనార్టీల నాయకుడు అఫ్సర్

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం మంత్రి పర్యటనలో పార్యటనలో వీరంతా పార్టీలో చేరారు. శ్రీనాథరెడ్డి, అనీషారెడ్డి, వ్యాపారవేత్త ఎంఎం.మహమ్మదాలి తమ సహచరులైన ఖలీల్ అహమ్మద్, రహమత్‌బాషా,ఎస్‌కేపీ ఖాజా, ఇమ్రాన్, రవిచంద్రరాజు, అఫ్సర్‌బాషా, నూరుల్లాతో కలసి సుమారు 100 మంది కార్యకర్తలతో పార్టీలో చేరారు. వీరందరికి మంత్రి పెద్దిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు ఇస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మైనారిటీ నాయకులు బీటీ అతావుల్లా, ఎంఎం.సాధిక్, సలీం, నూరుల్లా, ఖాదర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలోపార్టీలో చేరిన రవిచంద్రరాజు, కుటుంబ సభ్యులు



పార్టీలో చేరిన చింతపండు వ్యాపారి ఎస్‌కేపీ ఖాజా

నేడు జిల్లా కోర్టు కాంప్లెక్స్ ప్రారంభం

- సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల రాక
- రూ.40 కోట్లతో ఏడంతస్తుల భవనం నిర్మాణం
- పటిష్ట పోలీసు బందోబస్తు



విద్యుత్‌కాంతుల్లో ఐదు అంతుస్తుల కోర్టు సముదాయం

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా కేంద్రంలో అధునాత హంగులతో నిర్మించిన జిల్లా న్యాయస్థానాల సముదాయాన్ని శనివారం దేశ అత్యున్నత న్యాయస్థానం, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయాధికారులు ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లాలో అధునాతన హంగులు, అత్యాధునిక వసతులతో న్యాయస్థానాల భవన సముదాయం నిర్మించడం ప్రప్రథమం. ఐదు బహుళ అంతస్తుల భవనంలో చిత్తూరులో ఉన్న జిల్లా ప్రధాన న్యాయస్థానంతో పాటు మొత్తం 15 న్యాయస్థానాలు ఒకే ప్రాంగణంలో కొలువుదీరనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.43 కోట్ల వ్యయంతో ఈ భవనాలను నిర్మించింది.

180 ఏళ్ల తరువాత....

చిత్తూరులోని న్యాయస్థానాల సముదాయానికి సుదీర్ఘ చరిత్ర ఉంది మద్రాసు ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో దాదాపు 180 ఏళ్ల కిందట చిత్తూరులో న్యాయస్థానాల సముదాయాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో రెండు కోర్టులు ఏర్పాటు చేయగా.. ఇక్కడ జిల్లా కోర్టుతో పాటు 15 న్యాయస్థానాలు ఏర్పాటయ్యాయి. ఏళ్ల తరబడి ఇక్కడ కోర్టు భవనాలు ఉపయోగంలో ఉండగా....వీటిని అత్యాధునికంగా నిర్మించాలని భావించి పనులు పూర్తి చేశారు.

కోర్టు ఇలా..

స్టిల్ట్‌ఫ్లోర్‌లో..క్యాంటిన్, బ్యాంకు, పోస్టు ఆఫీస్ ఉండేలా నిర్మాణం చేశారు. అలాగే ఫస్ట్ ఫ్లోర్‌లో బార్ అసోసియేషన్, లైబ్రరీ, సెంట్రల్ రికార్డ్స్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, పీపీ రూమ్స్, వెయిటింగ్ హాల్, సెకెండ్ ఫ్లోర్‌లో.. కోర్టు హాల్ ఐదు విభాగాలు, జడ్జి చాంబర్, వెయిటింగ్ హాల్, ప్రాపర్టీ రూమ్, ఇతరత్రాలు ఉన్నాయి. మూడు, నాలుగో ఫ్లోర్లలో కోర్టు హాల్ ఐదు విభాగాలు, జడ్జి చాంబర్, వెయిటింగ్ హాల్, ఇతరత్ర హాళ్లు ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన నేతలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె : మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ దాదేపల్లెలో టీడీపీ నుంచి వంద కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ దాదేపల్లెలో ఏకపక్షంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి అధిక మెజారిటీ సాధించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో అజీజ్‌సాబ్ ,చిట్టిబాబు, ఖాజా, దాదాపీర్, జహీర్, బహదూర్, బావాజాన్, సయ్యద్‌బాషా , బాబు ,షావలీ, ఖాసీం, ముబారక్, సద్దాం, నాసీర్ , ఇలియాజ్, నూరు ,రియాజ్, అల్లావుద్దీన్, హసన్ ఉన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, నేతలు మిద్దిటి కిషోర్ వెంగారెడ్డి, అల్తాఫ్, సాధిక్, సనావుల్లా పాల్గొన్నారు.

బంగారుపాళెంలో 25 కుటుంబాలు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన బండ పూజారి, శంకరయ్య ఆధ్వర్యంలో 25 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా వారికి కడువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

కుప్పంలో దూకుడు పెంచిన భరత్

- కుటుంబ సమేతంగా ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో భరత్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

కుప్పం రూరల్: కుప్పం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ ఎన్నికల ప్రచారంలో ఒక్కసారిగా దూకుడు పెంచారు. ఇప్పటి వరకు భరత్ గెలుపు కోసం తల్లి పద్మమ్మ, సతీమణి దుర్గ ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం అటు కుటుంబ, బంధువర్గ పరివార సమేతంగా పెద్దసంఖ్యలో ప్రచారం చేయడం ప్రజల దృష్టిని ఆకర్షించింది. కుప్పం మండలం అడవిబూదుగూరు పంచాయతీలో భరత్‌తో పాటు కుటుంబ సభ్యులు జోరుగా ప్రచారం చేశారు. భరత్‌కు ఎమ్మెల్యేగా ×ఒక్క అవకాశం కల్పిస్తే నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు ఎంతో మంచి చేస్తాడు..ఆశీర్వదించండి అని కరపత్ర ప్రచారంతో అభ్యర్థించారు. ప్రజలు భరత్ కుటుంబ సభ్యులను చూసేందుకు ఆసక్తి చూపారు. వారి అభ్యర్థనకు సానుకూలంగా స్పందించారు. ప్రచారంలో భరత్ తల్లి పద్మమ్మ, తమ్ముడు శరత్, భరత్ పెద్దమ్మ విజయారెడ్డి, కుమార్తె ఆరా కృష్ణ, భరత్ సతీమణి దుర్గ తరపున బంధువుల్లో నానమ్మ ఇందిర, అమ్మమ్మ ఉషా ఠాకూర్, అమ్మ చేతనా ఠాకూర్, అత్త పూర్ణిమ, పెద్దమ్మ సంగీత ఠాకూర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలపై విశ్వంలో అవగాహన సదస్సు రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్లో ఆదివారం ఉదయం 10గంటలకు సైనిక్, నవోదయ, మిలటరీ స్కూళ్లల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలపై ఉచితంగా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విశ్వం విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు 4నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆయా పోటీ పరీక్షలకు సంబంధించి సందేహాల నివృత్తితో పాటు సీట్లు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు, మెలకువలను నిపుణులు వివరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించ వచ్చని ఆయన కోరారు.

సన్మార్గంలో నడిస్తే అంతా శుభమే



గరికిపాటి నరసింహారావు

చిత్తూరురూరల్(కాణిపాకం): మనిషి సన్మార్గంలో నడిస్తే.. సకల శుభాలు లభిస్తాయని..భగవంతుడి ఆశీస్సులు ఉంటాయని ప్రముఖ ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు ఉద్ఘాటించారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం నారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో భక్త చింతామణి శతకంపై ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత నారాయణి అమ్మకు పూజలు చేసి ప్రవచనాలు ప్రారంభించారు. అనంతరం భక్త చింతామణి శతకంలోని కొన్ని అంశాలపై ఆయన ప్రవచించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు టూటౌన్ పోలీసులు మానవత్వం చాటుకున్నారు. గురువారం రాత్రి నగరంలోని తోటపాళ్యంలో ఇద్దరు దుండగులు ఆషిక్ అనే వ్యక్తిని కత్తితో నరికి చంపారు. మృతుడి భౌతిక కాయాన్ని కేరళలోని స్వగ్రామానికి తరలించేందుకు డబ్బు లేక దిగాలుపడిన బాధితురాలని పోలీసులు ఆదుకున్నారు. అనాథలైన ఇద్దరు పిల్లలతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ఆషిక్ భార్యను పరామర్శించారు. అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని తరలించేందుకు టూటౌన్ సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రసాద్, మురళీ, సిబ్బంది రూ. 30 వేల ఆర్థికసాయం అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గురునాథంరెడ్డి (ఫైల్)

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని పూతలపట్టు మార్గంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. కత్తిరెడ్డిపల్లెకు చెందిన టి.గురునాథంరెడ్డి (42) వ్యవసాయ పనిముట్ల మరమ్మతులకు పెనుమూరుకు బైక్‌పై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఉండగా వెనుక నుంచి ప్రొక్లెయినర్ ఢీకొంది. దీంతో గురునాథంరెడ్డి అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.67లక్షల నగదు సీజ్

గుడిపాల: మండలంలోని గొల్లమడుగు చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి రశీదులు లేకుండా తీసుకువెళుతున్న రూ.1.67లక్షల నగదు పట్టుబడినట్లు ఎస్ఎస్‌టీ టీమ్ లీడర్ రెహమాన్ తెలిపారు. తమిళనాడు నుంచి వస్తున్న ఐషర్ వాహనంలో తరలిస్తున్న నగదును సీజ్ చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో సిబ్బంది నాగరాజు, మునిరత్నం, గోపి పాల్గొన్నారు.

బొలేరో ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతిచెందిన అంజప్ప

చౌడేపల్లె : మండలంలోని ఠాణా కొత్త ఇండ్లు వద్ద శుక్రవారం బొలేరో వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన సి.అంజప్ప(52) చౌడేపల్లె నుంచి నడుచుకుంటూ వెళుతుండగా పుంగనూరు వైపు నుంచి వస్తున్న బొలేరో ఢీకొంది. క్షతగాత్రుడిని 108లో సిబ్బంది గణేష్, ప్రసాద్ పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ అంజప్ప మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చమూకల దౌర్జన్యం



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు

పలమనేరు : వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఎకేఎస్ జాఫర్ ఇంట్లోకి టీడీపీ నాయకులు అక్రమంగా చొరబడి కుటుంబసభ్యులపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటన పలమనేరులో శుక్రవారం చోటుచేసుకుంది. ఇంట్లో మహిళలు ప్రార్థన చేసుకుంటుండగా పచ్చనేతలు లోపలికి ప్రవేశించడంపై ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లతో రాజకీయాలు చేయిస్తున్నారో. లేదో.. చెక్ చేసేందుకు వచ్చామని టీడీపీ నేతలు చెప్పడంపై మండిపడ్డారు. విషయం తెలిసి పోలీసులు అక్కడకు రావడంతో టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. అనంతరం చల్లగా జారుకున్నారు. ఈ ఘటనలో టీడీపీ నేతలు మదన్‌మోహన్, శ్రీధర్ తదితరులపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.